నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | PEDDAPALLI

# ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే..

- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే స్థలంలో రాజీవ్ విగ్రహం పెట్టడం సరికాదు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం



గోదావరిఖనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, సెప్టెంబర్ 17 : గతంలో రేవంత్‌రెడ్డి సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్‌గాంధీని ముద్దపప్పు అని తిట్టి, ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం గోదావరిఖనిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మాట్లాడారు. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు బీఆర్ఎస్ హయాంలో కేబినెట్ తీర్మానం చేసిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీశారని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమానికి, తెలంగాణ ప్రజలతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం ఎదుట ఏర్పాటు చేయడం తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. తెలంగాణ సచివాలయాన్ని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉంతో అద్భుతంగా నిర్మించి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంతోపాటు అమరవీరుల స్తూపం ఏర్పాటు చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, కేటీఆర్‌పై ఇష్టారీతిన మాట్లాడుతూ వీధి రౌడీలా, గల్లీ లీడర్‌గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలను గౌరవించి అభివృద్ధికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటను, హామీని నిలబెట్టుకోవడంలో తొమ్మిది నెలల రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి తాము వ్యతిరేకం కాదని, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు సరికాదని హితవుపలికారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేటర్లు పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, బాదె అంజలి, గాదం విజయం, కల్వచర్ల కృష్ణవేణి, రమణారెడ్డి, నాయకులు నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, పీటీ స్వామి, అచ్చె వేణు, బొడ్డు రవీందర్, చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేశ్, చెలకలపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, తోకల రమేశ్, సట్టు శ్రీనివాస్, యాసర్ల తిమోతి, రామరాజు, వడ్లూరి రాములు, రాజేశ్, మహేందర్, రమ్య, ముద్దసాని సంధ్యారెడ్డి, ఆవునూరి వెంకటేష్, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.



గోదావరిఖని : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్



పెద్దపల్లి: పెద్దపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి




జగిత్యాల: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

# నిరసన జ్వాల

**కాంగ్రెస్ సర్కారు తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల కన్నెర్ర**

- తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిపాదిత స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడంపై ఆగ్రహం
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిరసనలు
- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు

బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. రాష్ట్ర సచివాలయం, అమర జ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి నిర్ణయానికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ సర్కారు తీరుకు నిరసనగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు. ఇది సరైన నిర్ణయం కాదని, వెంటనే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే పెట్టాలని డిమాండ్ చేశారు.

**-పెద్దపల్లి, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ)**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. అనంతరం మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల పార్టీ ఇన్‌చార్జి బండారి శ్రీనివాస్ గౌడ్, మండలాధ్యక్షుడు మార్కు లక్ష్మణ్‌తో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. గోదావరిఖనిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ తల్లిని అవమాన పరిచిన సీఎం వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపుమేరకు మంథని పాత పెట్రోల్ పంపు సమీపంలో, కమాన్‌పూర్ మండలం సిద్ధిపల్లె పంచాయతీలో తెలంగాణ తల్లి విగ్రహాలకు పార్టీ నేతలు పాలాభిషేకం చేశారు.



సైదాపూర్ : కొత్తబస్టాండ్ తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ధర్మారం: దొంగతుర్తిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ప్యాక్స్ చైర్మన్ బలరాం రెడ్డి



మారుతీనగర్ : మెట్‌పల్లి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మల్లాపూర్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



హుజూరాబాద్ రూరల్ : పెద్దపాపయ్యపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కమాన్‌పూర్ : పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ముువ్వన్నెల జెండా రెపరెపలు

- ఘనంగా ప్రజాపాలన దినోత్సవం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- కరీంనగర్‌లో జెండా ఎగరేసిన మంత్రి శ్రీధర్‌బాబు
- జగిత్యాలలో విప్ అడ్లూరి, సిరిసిల్లలో విప్ ఆది శ్రీనివాస్
- పెద్దపల్లిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



కరీంనగర్ : అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, తదితరులు

మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దినోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జాతీయ జెండా ఎగరేయగా, జగిత్యాల కలెక్టరేట్‌లో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి కలెక్టరేట్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

**- పెద్దపల్లి, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ)**

## కరీంనగర్‌లో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాంనగర్, సెప్టెంబర్ 17 : నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించే స్కిల్ సెంటర్ కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో విశ్వబ్రాహ్మణులకు కోర్సు ప్రవేశపెడుతామని చెప్పారు. విశ్వకర్మల శ్రమ లేనిదే విశ్వంలో ఏపనీ జరుగదన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందని, కుల వృత్తిదారులకు ఆదాయం కల్పించే మార్గాలను అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో విశ్వకర్మలు భవనం నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలం పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో కే మహేశ్వర్, బీసీ సంక్షేమశాఖాధికారి అనిల్ ప్రకాశ్, విశ్వకర్మ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తల్లి సంరక్షణ మరిచిన కొడుకు

- అధికారులకు మొరపెట్టుకున్నా దక్కని ఫలితం
- మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం చుట్టూ వృద్ధురాలి ప్రదక్షిణ



మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉత్తర్వుల కాపీతో ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు ఏనుగు రాజు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 17: నవమాసాలు మోసి కనీ పెంచిన కొడుకు వృద్ధాప్యంలో తన సంరక్షణ చూసుకుంటాడునుకున్న ఆ తల్లికి నిరాశే ఎదురైంది. కొడుకు తీరుపై అధికారులకు విన్నవించినా ఫలితం దక్కకపోవడంతో మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. బాధితురాలి కథనం ప్రకారం.. మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు రాజు అనే వృద్ధురాలికి ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లున్నారు. 20 ఏళ్ల క్రితమే వీరందరికీ వివాహాలు చేశారు. ఆరు నెలల క్రితం వృద్ధురాలి భర్త రాజగంగారాం అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే, కొడుకు ఏనుగు మోహన్‌రెడ్డి తల్లి బాగోగులు చూసుకోకపోవడంతోపాటు తండ్రి వైద్య ఖర్చులు రూ.1.20 లక్షలు సైతం ముగ్గురు కూతుళ్లే భరించారు. దీంతో జూలై 4న వృద్ధురాలు 'ప్రజావాణి'లో జగిత్యాల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఆర్డీవో వృద్ధురాలి కొడుకు మోహన్‌రెడ్డిని పిలిచి వాదప్రతివాదాలు విన్నారు. వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007 ప్రకారం తల్లి రాజుకు కొడుకు మోహన్‌రెడ్డి ప్రతినెలా రూ.2,500 చెల్లించాలని జూలై 18న ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ కొడుకు డబ్బులు చెల్లించకపోవడంతో వృద్ధురాలు తనకు న్యాయం చేయాలంటూ మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. ఎన్నిసార్లు వచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని, రేపు రా, మాపు రా అంటూ తిప్పించుకొంటున్నారని వాపోయింది. అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. కాగా, మంగళవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించిన అధికారులు.. తనకు న్యాయం చేయాలని వచ్చిన వృద్ధురాలిని ఇంటికి పంపించడం కొసమెరుపు.



వేములవాడ టౌన్ : రాజన్న ఆలయం ముందు నుంచి నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు





సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల మానేరు వాగులో వినాయక నిమజ్జనం

# గంగమ్మ ఒడిలోకి..

- జగిత్యాల జిల్లాలో వైభవంగా గణేశ్ నిమజ్జన వేడుకలు

జగిత్యాల, సెప్టెంబర్ 17 : నవరాత్రులు పూజలందుకున్న గౌరీ సుతుడు గంగమ్మ ఒడిలోకి చేరాడు. జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. భక్తుల ఆటపాటలు, వివిధ వేషధారణలతో 'జై బోలో గణేశ్ మహరాజ్ కి జై' అనే నినాదాలతో కోలాహలంగా నిర్వహించారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఆనందోత్సాహాల మధ్య, అందంగా అలంకరించిన వాహనాల్లో గణపతులను నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. కొన్ని చోట్ల సోమవారమే నిమజ్జనం చేయగా, మంగళవారం సైతం నిమజ్జన వేడుకలు కొనసాగాయి. అధికార యంత్రాంగం భారీ క్రేన్లను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కోరుట్లలో శోభాయాత్రను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల జెండా ఊపి ప్రారంభించారు.



సిరిసిల్ల రూరల్ : తంగళ్లపల్లిలో శోభాయాత్రలో కోలాటాలు ఆడుతున్న మహిళలు



కోరుట్ల : శోభయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



సిరిసిల్ల టౌన్ : హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో ఏర్పాటుచేసిన స్టేజి వద్ద పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, తదితరులు

## ఆఖరి రోజు అపశృతులు

- ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి
- పటాకులు పేలి కారు దగ్ధం

రాంనగర్ సెప్టెంబర్ 17: గణేశ్ నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ యువకులు మద్యం మత్తులో చేసిన కేరింతలు ప్రమాదాలకు కారణమయ్యాయి. కిసాన్‌నగర్‌లోని రోడ్డు నెంబర్ 12లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని మంగళవారం ఉదయం కొత్తపెల్లి చెరువులో నిమజ్జనం చేసి వస్తుండగా ట్రాక్టర్, ట్రాలీకి మధ్య నిలబడిన కోటగిరి సుమంత్(26) అదుపుతప్పి కిందపడగా అతడిపై నుంచి టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం మండపాలను వదిలి బయలుదేరిన గణనాథుల ఎదుట పటాకలు పేల్చడంతో రాంపూర్ ప్రాంతంలో నిప్పురవ్వలు ఎగిరిపడి కార్ల షో రూంలో పడగా ఓ కారుకు నిప్పంటుకొని దగ్ధమైంది.

### ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 17 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా, ఆగస్టులో నిర్వహించిన ఎల్ఎల్‌బీ 4వ సెమిస్టర్ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వివరాలకు http://103.119.113.107:84,www.sata vahana.ac.inలో చూసుకోవచ్చన్నారు.

### 27లోగా ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 17 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్, ఎంఈడీ రెండు, నాలుగో సెమిసర్ట్ పరీక్ష ఫీజు ఈ నెల 27వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా, అపరాద రుసుము రూ.1000తో అక్టోబర్ 1వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు.

### లాభాల వాటా చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 17 : సింగరేణి బొగ్గు గని కార్మికుల కష్టార్జితమైన లాభాల వాటను వెంటనే చెల్లించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంస్థ సీఅండ్ఎండీ బలారామ్‌కు వినతి పత్రం పంపించారు. కార్మికులు 70 మిలియన్ టన్నుల బొగ్గు వెలికి తీసి సంస్థకు రూ.100 కోట్ల లాభాలను ఆర్జించి పెట్టారని గుర్తు చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా లాభాలు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు.